క్లుప్తంగా

29 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ జానకిరామయ్య

కొత్తూరు: మండలంలోని బలద గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా స్థానిక సీహెచ్‌సీకి చెందిన ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలను శనివారం నిర్వహించారు. 29 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి, నలుగురికి అంతర కుసుములు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఈనెల 27వ తేదీన శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యంత విలువైన ఐఓఎల్ ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో బలద ఎంఎల్‌హెచ్‌పీ జి.సృజన, ఏఎస్‌ఎం పావని, హెచ్‌ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొండవలస విద్యార్థికి గోల్డ్ మెడల్



వీసీ చేతులమీదుగా మెడల్ అందుకుంటున్న భార్గవనాయుడు

సరుబుజ్జిలి: మండలంలోని కొండవలస గ్రామానికి చెందిన విద్యార్థి లావేటి భార్గవనాయుడు ఏయూ వీసీ చేతులమీదుగా శనివారం గోల్డ్ మెడల్ అందుకున్నాడు. 2018–19 విద్యా సంవత్సరంలో వర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ విభాగంలో ప్రతిభ కనబర్చినందుకు స్నాతకోత్సవంలో మెడల్ అందుకున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

సారవకోట: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని బుడితి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి.సుజాత సూచించారు. మండలంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు అన్ని రకాల విటమిన్లతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని, దీంట్లో ఎక్కువగా ఐరన్ ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సూచించిన వ్యాక్సిన్లు సమయానికి వేసుకోవాలన్నారు. ఆమెతో పాటు ఏఎస్‌ఎం లక్ష్మి తదితరులు ఉన్నారు.

టవర్ ఏర్పాటుకు అడ్డగింత



ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామంలో ఇండస్ కంపెనీ ద్వారా టవర్ ఏర్పాటు చేయడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిపారు. తొలుత మొండిపట్టుపట్టిన కాంట్రాక్టర్, తర్వాత 100 మీటర్ల వరకు టవర్‌ను గ్రామానికి దూరంగా సర్దుబాటు చేసి ఏర్పాటు చేస్తామన్నారు. అయినా ఒప్పుకోని గ్రామస్తులు చర్చల నుంచి నిష్క్రమించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టవర్ ఏర్పాటును అడ్డుకుంటామని తేల్చి చెప్పారు.

కానరాని స్పందన



హిరమండలం: పోలీసుస్టేషన్‌లో టీడీపీ నేతలు

ఆమదాలవలస/నరసన్నపేట/హిరమండలం/పోలాకి/ఎల్‌ఎన్‌పేట: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జిల్లాలోని పలుచోట్ల టీడీపీ నాయకులు శనివారం ఆందోళనలు చేపట్టారు. అయితే నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి సానుకూల స్పందన కరువైంది. నిజంగానే ఎటువంటి అవినీతి చేయకుంటే ధైర్యంగా కేసును ఎదుర్కోవాలని పలువురు సూచించడం గమనార్హం. అదేవిధంగా శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

అవినీతి పండింది.. అరెస్టు జరిగింది

- టీడీపీ నాయకులది అనవసర రాద్ధాంతం
- కుట్రలకు కాలం చెల్లదు

టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి పాపం పండడంతోనే అరెస్టు జరిగిందని పలువురు వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లకు చంద్రబాబు చేసిన కుట్రలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగిందని తెలిసినా టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చ పత్రికలు, టీవీలను అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని ప్రయత్నించడం మానుకోవాలని సూచించారు. అవినీతి చేయకుంటే విచారణను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కాగా అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు హడావుడి చేయాలని చూసినా ప్రజల నుంచి కనీసం మద్దతు లభించలేదు.



రోజూ మాదిరిగానే నరసన్నపేటలో కొనసాగుతున్న కార్యకలాపాలు

శేష జీవితం జైల్లోనే



స్కిల్ డవలప్‌మెంట్ స్కాంలో అరెస్టైన చంద్రబాబునాయుడు తన శేష జీవితం జైల్లోనే గడపాల్సి వస్తుంది. దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన చంద్రబాబు అరెస్టు సబబే. ఈ స్కామ్‌లో రూ.371 కోట్లు ఆయన ఇంటికి చేరాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, ఎల్లో మీడియా ఒక దుర్మార్గపు ముఠాగా ఏర్పడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద బురద జల్లుతున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి, ఆమదాలవలస

ప్రధాన సూత్రధారి చంద్రబాబే



స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబే ప్రధాన సూత్రధారి. ఆయన ఏం చేసినా చెల్లుతుందని భావించి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. చంద్రబాబు తాను నిప్పునని చెప్పుకుంటూ ప్రజల సొమ్మును దోచుకున్నారు. చట్టం అందరికీ సమానమేనని నిరూపితం అయ్యింది. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిన ఆయనను కఠినంగా శిక్షించాలి.

రాజాపు అప్పన్న, రాష్ట్ర పొందర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, నరసన్నపేట

అరెస్టు సబబే



స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించిన కేసులో చంద్రబాబు అరెస్టు సబబే. ఈ కేసుపై సీఐడీ అన్ని రకాలుగా గడిచిన రెండేళ్లుగా దర్యాప్తు చేసింది. పూర్తి ఆధారాలతోనే అరెస్టు చేసింది. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు పాత్ర అప్పట్లో ఈ స్కామ్‌లో స్పష్టంగా ఉంది. ఆయన అరెస్టును ప్రజలందరూ స్వాగతిస్తున్నారు. సొంత మామనే వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి ప్రజలను వంచించడం పెద్ద విషయం కాదు.

– ఆరంగి మురళి, ఎంపీపీ, నరసన్నపేట

తప్పు చేస్తే శిక్ష తప్పదు



తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరు. చంద్రబాబు అరెస్టుతో రాజ్యాంగ సంస్థలపై నమ్మకం పెరిగింది. గతంతో కూడా ఎంతో మంది ప్రముఖులు, రాజకీయ పెద్దలను అరెస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా జరిగిన అరెస్టును రాజకీయంగా చూడడం సరైన పద్ధతి కాదు. దర్యాప్తు సంస్థలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది.

– ఏవీ సురేష్, వ్యాపారవేత్త, హిరమండలం

రూ.కోట్లు కొల్లగొట్టారు



స్కిల్ డవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబునాయుడు రూ.కోట్లు కొల్లగొట్టారు. ప్రజల సొమ్మును అక్రమంగా తరలించారు. అక్రమాలకు పాల్పడడం చట్టరీత్యా నేరం. సీఐడీ అధికారులు అక్రమాలను నిర్ధారించిన తర్వాతే అరెస్టు చేశారు. చంద్రబాబు అరెస్టు సక్రమమే.

– అంపిలి ప్రశాంత్ కుమార్, విద్యావేత్త, గూనభద్ర ఆర్ఆర్ కాలనీ, కొత్తూరు

చంద్రబాబు అవినీతి బయటపడింది



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన అవినీతి సీఐడీ అధికారుల విచారణలో బయటపడింది. స్కిల్ డవలమెంట్ పేరుతో చంద్రబాబు సుమారు రూ.371 కోట్ల ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో ప్రభుత్వ సొమ్మును దోచుకోవడం దారుణం. పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేయడం సబబే.

– చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, కొత్తూరు

చట్టానికి ఎవరూ చుట్టం కాదు



చట్టానికి ఎవరూ చుట్టం కాదు. తప్పు చేసినపుడు ఎవరైనా శిక్షార్హులే. స్కిల్ డవలప్‌మెంట్ స్కీమ్‌లో జరిగిన అవినీతిపై చంద్రబాబునాయుడుపై సీఐడీ విభాగం తీసుకున్న చర్యలు స్వాగతిస్తున్నాం. ఏస్థాయిలో ఉన్నవారైనా తప్పు చేస్తే శిక్ష తప్పదు. వ్యవస్థలపై నమ్మకం పెంచేవిధంగా దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకోవడం శుభ పరిమాణం.

– తూలుగు తిరుపతిరావు, విశ్రాంత అధ్యాపకుడు, హిరమండలం

నిరూపించుకోవాలి



స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతి చేయకపోతే విచారణలో నిరూపించుకోవాలి. సీఐడీ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసిందటే పక్కా ఆధారాలు ఉంటాయి. ఎవరు తప్పుచేసినా తప్పించుకోలేరు. చట్టం అందరికీ సమానమే. ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉంది.

– ఎం.చిరంజీవులనాయుడు, విశాంత ఉపాధ్యాయుడు, హిరమండలం

అరెస్టు సక్రమమే



ప్రజల సొత్తు దోచుకొని మోసగించిన చంద్రబాబునాయుడు అరెస్టు సక్రమమే. ప్రభుత్వ సొమ్ము రూ.371 కోట్లు అవినీతి చేసిన నాయకుడు రాష్ట్రానికి అవసరం లేదు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా శిక్ష తప్పదు. ఇంతపెద్ద స్కాం చేసి మళ్లీ ఎన్నికల్లో ప్రజల్లోకి ఏ మొహం పెట్టుకొని వస్తారు. ఏది ఏమైనా ఇటువంటివారిని శిక్షించాలి.

– జె.జె.మోహన్‌రావు, వ్యాపారవేత్త, ఆమదాలవలస

‘పచ్చ పత్రికలతో విష ప్రచారం’



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరావు

సారవకోట: అనునిత్యం పచ్చ పత్రికలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మే చంద్రబాబు పాపం పండడంతో అరెస్టైయ్యారని పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్‌లు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వ్యవస్థలను మేనేజ్ చేసి ఇప్పటివరకు అనేక తప్పులు చేసినా అరెస్టు కాలేదన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన సమయం నుంచి ఓటుకు నోటు కేసు వరకు స్టేలు తెచ్చుకొని అరెస్టు కాకుండా తప్పించుకున్నాడని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టు సక్రమంగానే జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎడ్ల అసిరయ్య, గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, శంకర బాబు, జన్ని అనిరుద్రుడు, సాగిపల్లి దండాసి, గోవిందరావు, పార్టీ నాయకులు రావాడ శ్రీనివాసరావు, యాళ్ల శ్యామసుందరరావు, మెండ రామకృష్ణ, వాన కామేశ్వరరావు, కాళ్ల సింహాచలం, అరియాపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సమ్మేళనానికి తరలిరండి

నరసన్నపేట: విశాఖలో ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న మహారాష్ట్ర మండల్ ఫంక్షన్ హాల్ కల్యాణ మండపంలో ఆదివారం తూర్పు కాపు జాతి చైతన్య సమ్మేళన సభ నిర్వహించనున్నామని సంఘం గౌరవ అధ్యక్షులు పతివాడ గిరీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనానికి తూర్పుకాపుకు చెందిన అన్ని సంఘాలు తరలిరావాలని కోరారు. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో సంఘ భవనాల నిర్మాణంతో పాటు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు చేరుకోవాలని కోరారు.

రాజీయే రాజమార్గం



పొందూరు: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జ్యోత్స్న



ఆమదాలవలస: కేసులను పరిష్కరిస్తున్న సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస: ఎటువంటి కేసులోనైనా కక్షిదారులు ఆలోచించి రాజీపడడమే రాజమార్గమని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, న్యూసెన్స్, మనోవర్తి తదితర 718 కేసులను రాజీ చేశారు. తొలుత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి కక్షదారులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షణికావేశంలో తగాదాలు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఎస్.గోవిందరావు, సీనియర్ న్యాయవాదులు సాధు ధనుంజయరావు, కె.త్రినాథరావు, పైడి వరాహాల నరసింహులు, తమ్మినేని అన్నంనాయుడు, వి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పేర్కొన్నారు. పొందూరు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 440 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ రొక్కం శ్యామ్‌సంతోషి, లోక్ అదాలత్ మెంబర్ ఎ.రంగారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.మంజుల, న్యాయవాదులు బ్రహ్మాజీ, డి.కిరణ్ బాబు, అశోక్‌కుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి నిర్వహించారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు కలుపుకొని మొత్తం 567 కేసులను రాజీ చేశారు. కార్యక్రమములో కొత్తూరు, బత్తిలి, హిరమండలం పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు, ప్రభుత్వ ప్లీడర్ రఘునాథరావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్ వద్ద కల్యాణ మండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నామని కమిటీ ప్రతినిధి పొట్నూరు సాయి తెలిపారు. 1988లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు కలుస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ఉన్నవారు వస్తున్నారని పేర్కొన్నారు. సినీ నటుడు ప్రభాస్ శ్రీను తదితరులు హాజరు కానున్నారని వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస రూరల్: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాం గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు వద్దకే పరిపాలన వచ్చిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు గ్రామాల్లోనే అందుతున్నాయని వివరించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తొగరాం గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణి, కొత్తవలస సర్పంచ్ మెట్ట నాగజ్యోతి, వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు మెట్ట ఆనందరావు, కూటికుప్పల సన్యాసిరావు, తిర్లంగి రామారావు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ ఏఈ బి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.హరీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బూర్జ: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ఏపీపేట సచివాలయం పరిధి నరేంద్రపురం, సోమిదలవలస, గోపిదేవిపేట, బూర్జమానుగూడ, అనంతగిరిపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటా కుళాయిలకు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్, మండల కన్వీనర్ల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, సీనియర్ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్, గేదెల వెంకటరమణ, వండాన సత్యం, కర్రి తిరుపతి, వి.గౌరినాయుడు, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జన్మాష్టమి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ దీప

బూర్జ: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం ఎంపీపీ కర్నేన దీప హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామంలో నీలమణి అమ్మవారు, గ్రామదేవత ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 1500 మందికి అన్న సంతర్పణ చేపట్టారు.

జిల్లేడు ద్రావణంతో తెగుళ్ల నివారణ

ఎల్.ఎస్.పేట: పంటను ఆశించే అనేక తెగుళ్లను జిల్లేడు ద్రావణంతో నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మెంటర్ ఎం.పద్మావతి అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంట పెట్టుబడి తగ్గించుకుంటే ఆదాయం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వలన భూసారం తగ్గుతుందన్నారు. పంటకు పోటాషియం ఎంత ఉపయోగపడుతుందో పోటాషియం స్థానంలో జిల్లేడు ఆకుల ద్రావణం అంతే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంటి సూర్యనారాయణ, ఎల్–1 జగన్, ఐసీఆర్‌పీ సిబ్బంది రమణమ్మ, సుభాషిణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలతోనే సంతృప్తి



ఆస్పత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పీహెచ్‌సీలకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేత

ఆమదాలవలస రూరల్: తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలతోనే సంతృప్తి లభిస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో తొగరాం, దూసి గ్రామాల్లోని పీహెచ్‌సీలకు ట్రస్టు ఆధ్వర్యంలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు వస్తే దేశం అభివృద్ధి చెందుతున్నారు. ట్రస్టు ద్వారా జిల్లాలో ఆపద సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తమ వంతు సాయంగా ఆదుకుంటున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు చైర్‌పర్సన్, తొగరాం గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణీ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజల కష్టాలు చూశామని, అందుకే మరోసారి ఇబ్బందులు లేకుండా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందజేయడం జరుగుతోందన్నారు.

త్వరలోనే ఐసీయూ బెడ్స్ అందజేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.అనూరాధ, వైద్యాధికారులు స్రవంతి, బాలచందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్ పరామర్శ

నరసన్నపేట: స్థానిక శ్రీరామనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కోల శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. ఇటీవల కోల శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య కుమారి, కుమారుడు హర్షవర్దన్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్నివేళలా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, రాంజీ తదితరులు ఉన్నారు.



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్